క్లుప్తంగా

మైనర్లకు వాహనాలిస్తే చర్యలు


వాహనచోదకులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ భాస్కరరావు

గుర్ల: మైనర్లకు ద్విచక్ర వాహనాలు ఇస్తే వారి తల్లిదండ్రులు కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ భాస్కరరావు హెచ్చరించారు. మండలంలోని సోలిపిసోమరాజుపేట వద్ద పోలీస్ సిబ్బందితో కలిసి గురువారం ఆయన వాహన తనిఖీలు నిర్వహించారు. ద్విచక్ర వాహనాలు నడుపుతూ పట్టుబడిన మైనర్లపై కేసులు నమోదు చేశారు. వాహనచోదకులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు.

కొత్తశ్రీరంగరాజపురంలో వైద్యశిబిరం


శిబిరంలో సేవలందిస్తున్న వైద్యసిబ్బంది

గజపతినగరం: మండలంలోని కొత్త శ్రీరంగ రాజపురం గ్రామంలో మరుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి సుష్మ ఆధ్వర్యంలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 104 సిబ్బందితో కలిసి డాక్టర్ సుష్మ 59 మందికి వివిధ వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. సర్పంచ్ ఈజ్జిరోతు పైడిపునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్మీడియట్ ప్రవేశాలకు దరఖాస్తులాహ్వానం

గజపతినగరం: మండలంలోని మరుపల్లి మోడల్ స్కూల్‌లో 2024–25 విద్యాసంవత్సరంలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తూ ప్రిన్సిపాల్ గెద్ద ఈశ్వరరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు రాసిన విద్యార్థులు మే22వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసు కోవాలని సూచించారు. ఆన్‌లైన్ దరఖాస్తు కాపీతో పాటు కుల, ఆదాయ ధ్రువీకరణపత్రాలు ఆధార్, రేషన్ కార్డుల జెరాక్స్‌లు, స్టడి సర్టిఫికెట్‌ను జత చేసి నేరుగా మోడల్ స్కూల్‌లో అందజేయాలని సూచించారు. 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో సాధించిన మార్కులతో పాటు రూల్ ఆఫ్ రిజర్వేషన్ నిబంధనల ప్రకారం ప్రవేశాలు కల్పిస్తామని పేర్కొన్నారు.

సచివాలయంలో తనిఖీలు


రికార్డులు తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ హరిహరరావు

బొండపల్లి: మండలంలోని బి.రాజేరు గ్రామసచివాలయంలో ఎంపీడీఓ ఎస్.హరిహరరావు గురువారం తనిఖీలు నిర్వహించారు. ఉద్యోగుల హాజరు, తదితర రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో ఎన్నికల కోడ్‌ను పక్కాగా అమలు చేయాల్సిన బాధ్యత సచివాలయ ఉద్యోగులపై ఉందని అన్నారు. నిబంధనలు అతిక్రమించే వారిపై చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఎక్కడా అనుమతులు లేకుండా ర్యాలీలు,సభలు నిర్వహించకుండా చూడాలని సూచించారు.

యథావిధిగా రేషన్ పంపిణీ


డీలర్లు, ఎండీయూ వాహన ఆపరేటర్లకు సూచనలు చేస్తున్న సీఎస్‌డీటీ రామారావు

చీపురుపల్లి: ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పటికీ యథావిధిగా ఎండీయూ వాహనాల ద్వారా డోర్ డెలివరీ విధానంలోనే రేషన్ సరుకులు పంపిణీ చేయాలని సీఎస్‌డీటీ పి.రామారావు సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రేషన్‌డీలర్లు, ఎండీయూ వాహన ఆపరేటర్లతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్ లబ్ధిదారులకు ఈనెల రాగి పిండిని కూడా అందజేయాలని చెప్పారు. రేషన్ డీలర్లు,ఆపరేటర్లు రాజకీయ ప్రచారాల్లో పాల్గొన కూడదని చెప్పారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గుర్ల: మండలంలోని పాలవలస ఫీడర్ పరిధి గ్రామాలకు శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు జిల్లా విద్యుత్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పూడి హరి గురువారం తెలి పారు. ఫీడర్ పరిధిలోని ట్రాన్స్‌ఫార్మర్లకు మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో పాలవలస, గూడెం, పకీరు కిత్తలి, బూర్లిపేట, కొండగండ్రేడు, ముద్దాడపేట, గేదెలపేట, మునకాల పేట గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

అభివృద్ధి ఆనందం


ఆనందపురం రైతు భరోసా కేంద్రం


మెరగాన వీధిలో వేసిన సీసీ రోడ్డు


జగనన్నలే అవుట్‌లో నిర్మించిన ఇళ్లు


రజక వీధిలో నిర్మించిన సీసీ రోడ్డు

- ప్రగతిపథంలో ఆనందపురం
- సుమారు రూ.4 కోట్లతో అభివృద్ధి పనులు
- జీటీ, వీధి రోడ్లు , సీసీ కాలువల నిర్మాణం
- ఇంటింటికీ తాగునీటి కుళాయిల ఏర్పాటు
- అర్హులందరికీ ఇంటి స్థలం, ఇళ్లు మంజూరు
- పథకాల ద్వారా ప్రత్యక్ష నగదు బదిలీ విధానం(డీబీటీ)లో ప్రజలకు చేకూరిన లబ్ధి: రూ. 10.92 కోట్లు
- వివిధ పథకాల ద్వారా ప్రజలకు పరోక్షంగా (నాన్‌డీబీటీ) చేకూరిన లబ్ధి: రూ.3.59 కోట్లు

గుర్ల: మండలంలోని ఆనందపురం గ్రామం ప్రగతిపథంలో దూసుకుపోతోంది. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామంలో అభివృద్ధి ఊపందుకుంది. పరిపాలనలో ముఖ్య మంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువచ్చిన సంస్కరణల ఫలితంగా పల్లెల ముఖ చిత్రాలు మారాయి. ప్రభుత్వం ప్రతీ 2 వేల జనాభాకు ఒక గ్రామ సచివా లయం ఏర్పాటు చేసింది. ఆనందపురం జనాభా 2,100 మంది ఉండడంతో ఇతర గ్రామాలను కలపాల్సిన అవసరం లేకుండా కేవలం ఈ గ్రామం కోసమే ఒక సచివాలయం ఏర్పాటు చేశారు. ప్రభుత్వ విధానాలకు తోడు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ప్రత్యేక చొరవ, అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో గ్రామంలో ఈ అయిదేళ్లలో సుమారుగా రూ.4కోట్లతో అభివృద్ధి పనులు జరిగాయి. రూ.32లక్షలతో సిమెంట్ రోడ్లు, కాలువలు నిర్మించారు. రూ.40 లక్షలతో గ్రామ సచివాలయ భవనాన్ని నిర్మిస్తున్నారు. రూ. 21.80 లక్షలతో రైతు భరోసా కేంద్ర భవనం, రూ.17.50 లక్షలతో హెల్త్ వెల్‌నెస్ సెంటర్ భవనం నిర్మించారు. గ్రామంలో జగనన్న లేఅవుట్ ఏర్పాటు చేసి 8 మందికి ఇళ్ల పట్టాలు అందజేసి, ఇళ్లు మంజూరు చేశారు. అలాగే సొంత స్థలాలు ఉన్న 50 కుటుంబాలకు ఇళ్లు మంజూరు చేశారు. వీరికి ఇళ్ల నిర్మాణాల కోసం రూ.1.04 కోట్లను బిల్లుల రూపంలో కేటాయించింది.మన బడి నాడు–నేడులో భాగంగా గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో రూ. 18.28 లక్షలతో అభివృద్ధి పనులు చేసి, మౌలిక సదుపాయాలు మెరుగుపరిచి బడి రూపురేఖలను మార్చేశారు. జలజీవన్ మిషన్ పథకం కింద రూ. 58 లక్షలతో ఇంటింటి కుళాయిలు ఏర్పాటు చేశారు. ఆనందపురం– నడుపూరు, గ్రామాల మధ్య కోటి రూపాయలతో తారు రోడ్డు నిర్మించారు. అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం సమప్రాధాన్యం ఇచ్చిందని చెప్పేందుకు పథకాల ద్వారా ప్రజలు పొందిన లబ్ధే నిదర్శనం. అయిదేళ్లలో ప్రభుత్వం వివిధ పథకాల ద్వారా గ్రామంలోని ప్రజల ఖాతాల్లో నేరుగా రూ.10,92,41,960 జమచేశారు. మరికొన్ని పథకాల ద్వారా పరోక్షంగా గ్రామ ప్రజల కోసం ప్రభుత్వం రూ. 3,59,01,937 ఖర్చు చేసింది.


హెల్త్ వెల్‌నెస్ కేంద్రం


గ్రామంలో ఇంటింట కుళాయిలు


నాడు–నేడులో భాగంగా ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన కుళాయిలు, ఇతర సదుపాయాలు


మొండి వీధిలో నిర్మించిన సీసీ రోడ్డు

పథకాల ద్వారా ప్రత్యక్షనగదు బదిలీ విధానంలో ప్రజకు చేకూరిన లబ్ధి వివరాలు

పథకం	లబ్ధిదారులు	నగదు
అమ్మ ఒడి	234	రూ.1,13,10,367
జగన్న విద్యాదీవెన	161	రూ.31,66,054
జగనన్న వసతి దీవెన	125	రూ.19,94,555
రైతు భరోసా	373	రూ.1,83,74,000
వైఎస్సార్ చేయూత	193	రూ.92,62,500
వైఎస్సార్ ఆసరా	454	రూ.1,11,00,933
డ్వాక్రా సున్నా వడ్డీ	502	రూ.9,75,869
హౌసింగ్	58	రూ.1,04,40,000
వాహన మిత్ర	31	రూ.10,20,000
జగనన్న చేదోడు	6	రూ.1,50,000
వైఎస్సార్ బీమా	10	రూ.12,60,000
వైఎస్సార్ పింఛన్ కానుక	368	రూ.3,53,57,500

గూడు కల్పించారు..


గతంలో సొంత ఇల్లు లేక ఇబ్బందులు పడేవాళ్లం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇంటి స్థలం ఇచ్చి ఇంటి నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు.ఇంటి నిర్మాణం పూర్తి చేసుకొని ఇప్పుడు సొంత ఇంట్లో నివసిస్తున్నాం. మాకు ఒక గూడు కల్పించిన ప్రభుత్వానికి రుణపడి ఉంటాం.
– సువ్వాడ చిన్నమ్మ, ఆనందపురం

రూ. 8.76 లక్షలు లబ్ధి చేకూరింది


వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పాలనలో మా కుటుంబానికి అయిదేళ్లలో రూ. 8.76 లక్షల లబ్ధి చేకూరింది. ఇంటి స్థలం, ఇంటి నిర్మాణ బిల్లు, రైతు భరోసా, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్‌చేయూత, డ్వాక్రా సున్నా వడ్డీ, పింఛన్ కానుక పథకాలు అందాయి. సీఎం జగన్ దయవల్ల మా ఆర్థిక పరిస్థితి మెరుగుపడింది.
– అల్లి లచ్చమ్మ, ఆనందపురం

అర్హులందరికీ పథకాలు


వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గ్రామంలో అనేక అభివృద్ధి పనులు జరిగాయి. గ్రామంలో సీసీ రోడ్లు, ప్రభుత్వ భవనాల నిర్మాణం చేపట్టారు .అర్హత ఉన్న ప్రతీ కుటుంబానికి సంక్షేమ పథకాలు అందుతున్నాయి. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, ప్రజాప్రతినిధులం నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజల సమస్యల పరిష్కరిస్తున్నాం.
– మీసాల సత్యవతి, ఆనందపురం సర్పంచ్

జనరంజక పాలన జగనన్నతోనే సాధ్యం

- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే కడుబండి
- ఘన స్వాగతం పలికిన వినాయకపల్లి గ్రామస్తులు


ఎమ్మెల్యే కడుబండికి హారతులిస్తున్న మహిళలు

శృంగవరపుకోట: మళ్లీ జగనన్నే రావాలి, జనరంజక పాలన కొనసాగాలని, జయహో జగన్ అటూ గురువారం రాత్రి మండలంలోని వినాయకపల్లి గ్రామంలో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యేకు గ్రామస్తులు పలికిన స్వాగతం, పట్టిన నీరాజనాలు, ప్రచారంలో గ్రామస్తులు ఉత్సాహంగా పాల్గొనడం ము ఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న జనరంజక పాలనకు నిదర్శనంగా నిలిచాయి. గురువారం రాత్రి 8 గంటలకు వినాయకపల్లి చేరిన ఎమ్మెల్యేను గ్రామస్తులు బ్యాండు మేళం, కోలాటాలు, చిరతలతో, పూలజల్లు ఘనంగా స్వాగతించారు. మహిళలు ఎమ్మెల్యేకు కుంకుమపెట్టి, హారతులిచ్చారు. గ్రామ దేవత ఆల యాల్లో ఎమ్మెల్యేతో పూజలు చేయించారు.

మంచి జరిగిందనిపిస్తేనే ఓటేయండి

ఎమ్మెల్యే కడుబండి మాట్లాడుతూ జగనన్న అయిదేళ్ల పాలనలో ప్రతీ గడపకు సంక్షేమ పథకాలు అందాయన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రభుత్వాన్ని ప్రజల ముంగిటకు తీసుకువచ్చారని, అన్నిరంగా సంక్షేమానికి, అభివృద్ధికి కృషిచేశారన్నారు. మీకు మంచి జరిగిందనిపిస్తేనే ఓటేయండని, ప్రజలకు నిజాయితీగా సేవ చేసి ఓటు అడిగే దమ్మున్న నాయకుడు జగన్ అని అన్నారు. కల్లబొల్లి మాటలు చెప్పి, అధికారం కోసం జట్లు కట్టి వస్తున్న నాయకులను తరిమి కొట్టాలని పిలుపునిచ్చారు. జనం కోసం నిలబడిన జగన్ మళ్లీ అధికారంలోకి వస్తేనే సంక్షే మం కొనసాగుతుందన్నారు. ఎస్‌కోట ఎమ్మెల్యేగా తనకు, విశాఖపట్నం ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మంత్రి బొత్స సత్యనారాయణ భార్య ఝాన్సీలక్ష్మికి ఫ్యానుగుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. ప్రచారంలో స్టేట్‌ఫోక్ అకాడమీ డైరెక్టర్ వి.రాంబాబు, వైస్ ఎంపీపీ పి.వి.రమణ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మోపాడ కుమార్, పోతనాపల్లి సర్పంచ్ కె.వెంకటరావు, నాయకులు కృష్ణంనాయుడు, వెలుచూరి కొండబాబు, మింది మాధవ, గనివాడ మణి, అప్పలసత్యం , రాపర్తి రామచంద్రరావు, జగదీష్, గుమ్మడి సన్యాసప్పడు, గణేష్, అప్పడు, తలారి రమణ, చింతల నారాయణమూర్తి, మోపాడ కోటి పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి సన్మానం


లచ్చన్న మాస్టారు దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయ సిబ్బంది

చీపురుపల్లి: స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడు మీసాల లచ్చన్న ఈనెల 31న ఉద్యోగ విర మణ చేయనున్నారు. ఈసందర్భంగా పాఠశాల హెచ్ఎం కె.చంద్రశేఖర్‌కుమార్ ఆధ్వర్యంలో ఆ పాఠశాలలో ఉపాధ్యాయుడు లచ్చన్న దంపతులను గురువారం ఘనంగా సన్మానించారు. ఎంఈఓ బూసి నాయుడు ఎస్‌డీఎస్ కళాశాల మాజీ వైస్ ప్రిన్సిపాల్ దాసరి రాములు, ఎస్ఆర్‌జే కళాశాల మాజీ ప్రిన్సిపాల్ చిన్నంనాయుడు, విశ్రాంత హెచ్ఎం ఎం.ఎస్.ఎన్.రాజు, కుప్పిలి విద్యాసాగర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే సంక్షేమం, అభివృద్ధి

- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే అప్పలనరసయ్య,ఎమ్మెల్సీ సురేష్‌బాబు


దత్తిలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అప్పలనరసయ్య, ఎమ్మెల్సీ సురేష్‌బాబు


దత్తి వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే ,ఎమ్మెల్సీ

దత్తిరాజేరు: ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సంక్షేమం, అభివృద్ధి సమపాళ్లలో సాగిందని... మళ్లీ జగన్ సీఎం అయితేనే సంక్షేమం, అభివృద్ధి కొనసాగుతుందని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు అన్నారు. మండలంలోని దత్తి గ్రామంలో గురువారం సాయంత్రం ఎన్ని కల ప్రచారం నిర్వహించారు. ముందుగా గ్రామంలోని ఆంజనేయస్వామి, వేంకటేశ్వరస్వామి, శివాలయంలో పూజలు చేశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్సీ సురేష్‌బాబు మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు పార్టీలకతీతంగా పథకాలు, అవినీతి రహిత పాలన అందించిన ఘనత సీఎం జగన్‌కు దక్కు తుందన్నారు. సంక్షేమ పథకాలతో పేదల ఆర్థిక పరిస్థితి మెరుగుపడిందన్నారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాను గుర్తుపై ఓటు వేసి గజపతినగరం ఎమ్మెల్యేగా బొత్స అప్పలనరసయ్యను, విజయనగరం ఎంపీగా బెల్లాన చంద్రశేఖర్‌ను గెలిపించాలని ప్రజలను కోరారు.

వలంటీర్ల జోలికి వస్తే ఊరుకునేది లేదు

ఎమ్మెల్యే అప్పలనరసయ్య మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నెలకొల్పిన గ్రామ వలంటీర్ వ్యవస్థ ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పని చేస్తోందని అన్నారు. ప్రతినెలా ఒకటో తేదీ ఉదయాన్నే తలు పు తట్టి వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు వలంటీర్లు పింఛన్లు అందిస్తున్నారని, ప్రజలకు పథకాలను ఇంటివద్దనే అందిస్తున్నారని చెప్పారు. నిస్వార్థంగా సేవలందిస్తున్న వలంటీర్లపై టీడీపీ నాయకులు లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని, వలంటీర్లు జోలికి వస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. గజపతినగరం నియోజకవర్గంలో ఏదైనా అభివృద్ధి జరిగిందంటే అప్పట్లో వైఎస్.రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు, ఇప్పుడు మళ్లీ ఆయన తనయుడు సీఎం జగన్ వల్లేనని చెప్పారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రాపాక కృష్ణార్జున, ఎమ్మెల్యే కుమారుడు బొత్స గురునాయుడు, ఎంపీపీ గేదెల సింహాద్రి అప్పలనాయుడు, జెడ్పీటీసీ రౌతు రాజేశ్వరి, వైస్ ఎంపీపీలు బమ్మిడి అప్పలనాయుడు, మిత్తిరెడ్డి రమేష్, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మంత్రి అప్పలనాయుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు సుమల శ్రీను, ఏఎంసీ వైస్ చైర్మన్ మండల శ్రీను పాల్గొన్నారు.

పరామర్శ


బాధితుడు అర్జునతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

శృంగవరపుకోట: మండలంలోని రేవళ్లపాలెం గ్రామంలో బుధవారం జరిగిన అగ్నిప్రమాదంలో చిటికిరెడ్డి అర్జునకు చెందిన పూరిల్లు కాలిపోయింది. విష యం తెలుసుకున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు గురువారం రేవళ్లపాలెం వెళ్లి బాధితుడిని పరామర్శించారు. తగిన సాయం అందిస్తామని ధైర్యం చెప్పారు.

ఎన్నికల విధులపై శిక్షణ


ఎన్నికల సిబ్బందికి సూచనలు చేస్తున్న ఆర్‌ఓ సూర్యకళ

గజపతినగరం రూరల్: త్వరలో జరగనున్న స్వార్వత్రిక ఎన్నికల్లో పోలింగ్ అధికారుల(పీఓ)దే కీలకపాత్ర అని నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు(ఆర్‌ఓ) సూర్యకళ అన్నారు. ఎన్నికల విధులపై మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో మెంటాడ, గంట్యాడ, బొండపల్లి, గజపతినగరం, దత్తిరాజేరు మండలాలకు చెందిన పీఓలకు గురువారం శిక్షణ ఇచ్చారు. ఈసందర్భంగా ఎన్నికల నిర్వహణ, ఈవీఎంల పనితీరు, తదితర విధులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. పోలింగ్‌బూత్‌ల్లో పూర్తిస్థాయి అధికారం పీఓలదేనని, తప్పులు జరగకుండా చూడాలని,.వీలైనంత వేగంగా పోలింగ్ పూర్తయ్యేలా చూడాలని ఆర్‌ఓ సూచించారు. ఆయా మండలాల తహసీల్దార్‌లు, ఎంపీడీఓలు, ఇతర ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

అవగాహన

మెరకముడిదాం: మండలంలోని చినబంటుపల్లి పంచాయతీ మధుర గ్రామం సింగవరంలో ప్రజలకు ఎన్నికల కోడ్‌పై బుధరాయవలస ఎస్‌ఐ బి.లోకేశ్వరరావు గురువారం రాత్రి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలకోడ్ అతిక్రమించినా, గొడవలు పడినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గొడవలకు పాల్పడిన వారిపై రౌడీ షీట్ తెరుస్తామని చెప్పారు. ప్రశాంత ఎన్నికల నిర్వహణకు సహకరించాలని కోరారు.

ఘనంగా రామాలయ ప్రతిష్ఠోత్సవం

గజపతినగరం రూరల్: మండలంలోని బంగారమ్మపేట గ్రామంలో రామాలయ ప్రతిష్ఠోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. వేదపండితుల ఆధ్వర్యంలో గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు.

ఎల్లారమ్మ పండగ

వేపాడ: మండలంలోని ఓబలయ్యపాలెంలో గ్రామదేవత ఎల్లారమ్మ పండగను గ్రామస్తులు గురువారం ఘనంగా నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి ఘటాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు.ఆలయ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన అగ్నిగుండాన్ని పలువురు భక్తులు తొక్కి మొక్కులు చెల్లించుకున్నారు.

బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక


గజపతినగరం: బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు


శృంగవరపుకోట: ఎస్.కోట బార్‌అసోషియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు

గజపతినగరం: స్థానిక ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ జూనియర్ సివిల్ కోర్టు ఆవరణలో ఎన్నికల అధికారి ఉప్పలపాటి రమేష్‌రాజు ఆధ్వర్యంలో బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకు న్నారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా బిట్రా సూర్యరావు, వైస్ ప్రెసిడెంట్‌గా రాపాక సాయి సురేష్, సెక్రట రీగా పొట్నూరు శ్రీను, జాయింట్ సెక్రటరీగా జెర్రి పోతుల జగదీష్, ట్రెజరర్‌గా లెంక రాంబాబు ఎన్నికయ్యారని రమేష్ రాజు తెలిపారు.

ఎస్.కోటలో..

శృంగవరపుకోట: స్థానిక మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టులో బార్‌అసోషియేషన్ ఎన్నికలు గురువారం పోటాపోటీగా జరిగాయి. న్యాయవాదుల సంఘం అధ్యక్షుడిగా జి.సూరిదేముడు గెలుపొందారని ఎన్నికల అధికారి న్యాయవాది మామిడి చంద్రశేఖర్, ఎన్నికల సహాయ అధికారి బొబ్బిలి రామకృష్ణ ప్రకటించారుఅసోసియేషన్ కార్యదర్శిగా బి.సత్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా ఎం.అప్పారావు, సంయుక్త కార్యదర్శిగా ఎల్.అప్పారావు, కోశాధికారిగా బి.త్రిమూర్తులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గానికి పలువురు న్యాయవాదులు శుభాకాంక్షలు తెలిపారు.

మండల సర్వసభ్య సమావేశం


మాట్లాడుతున్న ఎంపీపీ గోపమ్మ

కొత్తవలస: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ నీలంశెట్టి గోపమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున సమావే శంలో ఎలాంటి కొత్త పనులు, పథకాలకు సంబంధించిన తీర్మానాలు చేయకుండా సాదా సీదాగా ముగి సింది. అత్యావసర పనుల్లో భాగంగా ఆర్‌డబ్ల్యూఎస్ ఆ ధ్వర్యంలో సమ్మర్ కాష్ ప్రోగ్రామ్‌ను సుమారు రూ.7 లక్షలతో చేపడుతున్నట్లు ఎంపీపీ తెలిపారు. అలాగే విద్యుత్ పనులపై చర్చించారు. వైద్యా రోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం యథావిధిగా సాగుతుందని ఎంపీడీఓ ఎస్.రమణయ్య తెలిపారు. పీఏసీఎస్ అధ్యక్షుడు గొరపల్లి శివ, ఈఓపీఆర్డీ ధర్మారావు, మండల అధికారులు, ఎంపీటీసీ సభ్యులు,సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఇంటింటికీ వెళదాం..చేసిన మంచిని వివరిద్దాం


బూత్ కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడుబండి

శృంగవరపుకోట: బూత్ కమిటీ సభ్యులు, నాయకులు,కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన సంక్షేమం, అభివృద్ధిని వివరించి, ప్రజల మద్దతు కోరాలని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు సూచించారు. స్థానిక క్యాంపు ఆఫీస్‌లో వైఎస్సార్‌సీపీ ఎస్.కోట పట్టణ బూత్ కమిటీ సభ్యులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరిమధ్య అయినా విభేదాలు ఉంటే పక్కన పెట్టి పార్టీ విజయానికి అంతా కలిసి పని చేయాలని కోరారు. విశాఖపట్నం ఎంపీ అభ్యర్థిగా బొత్స ఝాన్సీలక్ష్మిని సీఎం జగన్ ప్రతిపాదించారని, 30 ఏళ్లుగా బొత్స కుటుంబం సేవలు అందుకున్న నియోజకవర్గ వాసులకు నేరుగా వారి కుటుంబానికి ఓటేసే అవకాశం ఇన్నాళ్లు రాలేదని, ఇప్పుడు ఆ అవకాశం వచ్చిం దన్న విషయాన్ని స్పష్టం చేయాలన్నారు. పార్టీలో అందరికీ సమాన గౌరవం, న్యాయం దక్కుతాయని చెప్పారు. పోలింగ్‌లోగా ప్రతీ ఇంటికి అయిదుసార్లు వెళ్లి, వైఎస్సార్ సీపీ అజెండాను వివరించాలని, ఫ్యానుగుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా బొత్స ఝాన్సీలక్ష్మి ని గెలిపించాలని ప్రజలను కోరాలని సూచించారు. మాజీ ఎమ్మెల్యే హైమావతి, జెడ్పీటీసీ ఎం.వెంక టలక్ష్మి, వైస్ ఎంపీపీ పి.వి.రమణ, స్టేట్ ఫోక్‌అకాడమీ డైరెక్టర్ వి.రాంబాబు, పార్టీ మండల అధ్యక్షుడు మోపాడ కుమార్, పట్టణ అధ్యక్షుడు షేక్ రహ్మాన్, పలువురు ఎంపీటీసీలు, వార్డు సభ్యు లు, నాయకులు పాల్గొన్నారు.

కిశోర బాలికల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ


విద్యార్థినులకు సూచనలు చేస్తున్న డీపీహెచ్ ఎన్‌ఓ సత్యవతి

గంట్యాడ: కిశోర బాలికలు, గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని వైద్య సిబ్బందికి డీపీహెచ్ఎన్ఓ మామిడి సత్యవతి సూచించారు. పెదవేమిలి గ్రామంలోని హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌ను గురువారం సందర్శించారు. రికార్డులను పరిశీలించి, గర్భిణులు, కిశోర బాలికలకు అందిస్తున్న సేవలపై సిబ్బందిని ఆరా తీశారు. అనంతరం గ్రామంలోని ఉన్నత పాఠశాలను సందర్శించి, విద్యార్థినులకు హెచ్‌బీ పరీక్షలు చేశారు. విధిగా పౌష్టికాహారం తీసుకోవాలని విద్యార్థినులకు సూచించారు. ఆమె వెంట ఎన్‌హెచ్ఎం డీపీఎం జి.ఆర్.నాయుడు, వైద్యారోగ్యశాఖ గణాంకఅధికారి ధర్మారావు, హెల్త్ ఎడ్యుకేటర్ ఎర్రన్న, సీహెచ్ఓ జి.కామేశ్వరి తదితరులు ఉన్నారు.